క్లుప్తంగా

సైబర్ నేరస్తులతో జాగ్రత్త

కొల్లిపర: మండల పరిధిలోని ప్రజలందరూ సైబర్ నేరస్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఫోన్ చేసి మేము బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నాము. మీ అకౌంట్ గానీ లేదా క్రెడిట్ కార్డు, ఆధార్ కార్డు గానీ రెన్యూవల్ చేస్తాం మీకు ఓటీపీ వస్తుంది నెంబర్ చెప్పండని అడిగితే అటువంటి వారికి ఎటువంటి సమాధానం చెప్పకుండా వెంటనే జాగ్రత్త వహించాలని వారు తెలిపారు. ప్రజలు తమ ప్రమేయం లేకుండా బ్యాంక్ ఖాతాలలో నగదు వేరే ఖాతాలకు బదిలీ అయినట్లుగా ఫోన్‌కు మేసేజ్ వస్తే వెంటనే కేంద్ర సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ 1930 నెంబర్ కు ఫోన్ చేసి తమకు జరిగిన మోసాన్ని వివరించాలన్నారు. అలాగే చేస్తే సైబర్ నేరస్తుల అకౌంట్ నుంచి డబ్బులు డ్రా కాకుండా అడ్డుకునే వీలుంటుందని వారు తెలిపారు.

సమస్యల పరిష్కారం కోరుతూ 8 అర్జీలు

తెనాలి: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ ప్రాంతాల్నుంచి వచ్చిన ప్రజలు ఎనిమిది అర్జీలు సమర్పించారు. సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ అర్జీలను స్వీకరించారు. వీటిలో రెవెన్యూకు సంబంధించి నాలుగు, పోలీస్‌శాఖ పరిధిలో ఒకటి, డివిజన్ పంచాయతీ అధికారి పరిధిలోకి వచ్చే మరొక అర్జీ, డీటీపీఓకు సంబంధించి ఇంకొక అర్జీని అందజేశారు. ఆయా శాఖల ఉన్నతాధికారులకు అర్జీలను పంపించి నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ తెలిపారు.

హేమలత టీచర్‌కు హెచ్‌ఎంగా పదోన్నతి



తెనాలి: స్థానిక చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూలులో 2000 సంవత్సరం నుంచి భౌతికశాస్త్ర స్కూల్ అసిస్టెంటుగా పనిచేస్తున్న నాగభైరు హేమలతకు ప్రధానోపాధ్యాయినిగా పదోన్నతి లభించింది. నిడుబ్రోలు మున్సిపల్ హైస్కూలుకు వెళుతున్న సందర్భంగా సోమవారం ఇక్కడి స్కూలులో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు రాజారెడ్డి, స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి పద్మ, సీనియర్ ఉపాధ్యాయులు అంబరీషుడు, శైలజ, సుభాష్ చంద్రబోస్, రమేష్, ఇతర ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.


కాలు తొలగించారని ఆత్మహత్య

తెనాలిరూరల్: షుగరు వ్యాధి కారణంగా కాలు తొలగించారన్న మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ ఐతానగర్ శివారు వైఎస్ఆర్ కాలనీకి చెందిన ఆకుల వీరయ్య (35) గతంలో కూలి పనులకు వెళుతుండేవాడు. మధుమేహం వ్యాధి కారణంగా అతని కాలును మోకాలు వరకు తొలగించారు. ఇప్పుడు తొడ భాగాన్ని తొలగించాలని వైద్యులు సూచించారు. దీంతో మనస్తాపానికి గురై ఈ నెల 9వ తేదీన ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. సోమవారం వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూ టౌన్ సీఐ నిసార్ బాషా తెలిపారు.

కృతజ్ఞతాభావం ఉన్నతమైనది

తెనాలి: భావాలలోకెల్లా ఉన్నతమైన భావం కృతజ్ఞతాభావమని, దీనిని వ్యక్తపరచినపుడే మనిషి ఉన్నతంగా ఎదుగుతారని శ్రీసర్వదేవ పరంజ్యోతి మానవ సేవాసమితి సభ్యులు పేర్కొన్నారు. నవంబర్ 14న కృతజ్ఞతా దినోత్సవం పురస్కరించుకుని సేవాసమితి సభ్యులు సోమవారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. బుర్రిపాలెం గ్రామంలోని ఘట్టమనేని నాగరత్నమ్మ, రాజా జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను సత్కరించారు. విద్యార్థులకు బిస్కట్లు, చాక్‌లెట్లను పంచారు. బుర్రిపాలెంరోడ్డులోని శ్రీమహాత్మా సేవాశాంతి ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. పట్టణ నందులపేటలో గల పట్టణ నిరాశ్రయుల కేంద్రంలోని వారికి పండ్లు, రొట్టెలు అందజేశారు. సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



తెనాలిరూరల్: మండలంలోని బుర్రిపాలెం గ్రామానికి చెందిన శ్రీ సర్వదేవ పరంజ్యోతి మాన సేవాసమితి ఆధ్వర్యంలో గ్రామంలోని ఘట్టమనేని నాగర్తనమ్మ, రాజా జెడ్పీ హైస్కూలు ఉపాధ్యాయులను సోమవారం సత్కరించారు. అలానే మహాత్మాగాంధీ సేవా శాంతి ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. శ్రీ సర్వదేవ పరంజ్యోతి భగవతి భగవాన్ బోధనలను ఆచరించే వారు ఈ నెల 14వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా కృతజ్ఞతా దినోత్సవాన్ని జరుపుకుంటారని, ఈ నేపథ్యంలో కార్యక్రమాలను నిర్వహించినట్టు సభ్యులు తెలిపారు.

కొబ్బరిబొండాల నిర్వహణ.. జటిలమే

- రెండేళ్లనాడు కంపోస్ట్ యార్డులో పీచుతయారీ యంత్రం ఏర్పాటు
- రూ.9.60 లక్షలు వెచ్చించి కొనుగోలు
- కెపాసిటీ తక్కువ కావడంతో రోడ్లపై వేస్తున్న ఖాళీ బొండాలు
- ఇబ్బందులు పడుతున్న పట్టణవాసులు



కంపోస్ట్ యార్డులోని కొబ్బరి కాయల పీచు తయారీ యూనిట్

తెనాలిఅర్బన్: పట్టణంలో కొబ్బరి బొండాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. రెండేళ్ల క్రితం తెనాలి బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్ట్ యార్డులో కొబ్బరి కాయల పీచు తయారీ యూనిట్‌ను ప్రారంభించినా ఆశించిన ఫలితాలు అందలేదు. దీంతో అధిక కెపాసిటీ ఉన్న యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు అధికారులు టెండర్లు పిలచారు. పట్టణంలో సుమారు 30కిపైగా కొబ్బరి బొండాల విక్రయ దుకాణాలున్నాయి. వాటి ద్వారా ప్రతిరోజు 10 నుంచి 12 టన్నుల ఉపయోగించిన బోండాలు వస్తుంటాయి. ఇలా వచ్చిన వాటిని వ్యాపారులు ప్రతిరోజు పారిశుద్ధ్య కార్మికులకు అందజేస్తుంటారు. వారు బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్ట్ యార్డుకు తరలించి ఆ తర్వాత వాటిని కాల్చివేస్తుంటారు. మరికొందరు కార్మికులు వాటిని రోడ్డు అంచులలో పోస్తుంటారు. కొబ్బరి బొండాలను కాల్చకుండా వాటిని పీచుగా మార్చుకోవచ్చని నేషనల్ గ్రీన్ ట్రిబునల్ 2022లో సూచించింది. దీంతో మున్సిపల్ అధికారులు కొబ్బరి కాయల పీచు తయారు చేసే యూనిట్‌ను నెలకొల్పాలని భావించి దానికోసం రూ.9.60 లక్షలు వెచ్చించారు.

అయిదు టన్నుల యూనిట్ ప్రారంభం

బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్ట్ యార్డులో అయిదు టన్నుల కొబ్బరి పీచును తయారు చేసే యూనిట్‌ను ఏర్పాటు చేశారు. తెనాలి పట్టణంలోని ఉపయోగించిన కొబ్బరి బొండాలను ప్రత్యేక వాహనంలో యూనిట్‌కు తెస్తున్నారు. యంత్రంలో వాటిని వేసి పీచును తయారు చేస్తున్నారు. పీచును కొద్దిరోజులు ఆరబెట్టి ఆతర్వాత వాటిని కట్టలు కట్టి విక్రయిస్తున్నారు. అయిదు టన్నుల బొండాలకు సుమారు అరటన్ను పీచు వస్తుంది. అలాగే పీచుతో పాటు కొంత కోకోపీట్ కూడావస్తుంది. కోకో పీట్‌ను మొక్కలకు ఎరువుగా ఉపయోగిస్తున్నారు. పీచును టన్ను రూ.15 వేలకు విక్రయిస్తున్నారు.

టెండర్ల దశలో 15 టన్నుల యూనిట్

తెనాలి పట్టణంలో కొబ్బరి బొండాల సమస్య ఎక్కువగా ఉండటం...వాటిపై ఫిర్యాదులు వస్తుండటంతో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెంటనే ప్రవేట్ సంస్థలతో మరో యూనిట్‌ను ఏర్పాటు చేయించాలని ఇటీవల నిర్వహించిన సమీక్షలో సూచించారు. దీంతో మున్సిపల్ అధికారులు దానికి టెండర్లు పిలిచారు. దానిలో పాల్గొన్న సదరు సంస్థ నిర్వాహకులు 15 టన్నుల పీచు తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తారు. అలాగే వ్యాపారులు తరలించిన ఖాళీ బొండాలను పీచుగా మార్చి మున్సిపాలిటీ దానిని అమ్ముతుంది. అందుకు గాను నెలకు సదరు సంస్థలకు రూ.90 వేలు మున్సిపాలిటీ చెల్లించనుంది. నూతన యూనిట్ తెనాలిలో ప్రారంభమైతే దాదాపు బొండాల సమస్య తొలగే అవకాశం ఉంది.

నెలలో సమస్య పరిష్కరిస్తాం



తెనాలి పట్టణంలో కొబ్బరి బొండాల సమస్య ఎక్కువగా ఉన్న మాట వాస్తవం. పీచు తయారు చేసే యూనిట్ చిన్నది కావటం వల్ల కొన్ని ఇబ్బందులు వస్తున్నాయి. 15 టన్నుల యూనిట్‌ను నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దాని ఏర్పాటు, నిర్వహణను ప్రవేట్ సంస్థలకు అప్పగిస్తున్నాం. టెండర్ల దశలో ఆప్రక్రియ ఉంది. నెలలో నూతన యూనిట్ ఏర్పాటు జరిగే అవకాశం ఉంది. యూనిట్ ప్రారంభం కాగానే దాదాపు తెనాలిలో బొండాల సమస్య ఉండదు.

–బండి శేషన్న, కమిషనర్, తెనాలి పురపాలక సంఘం

రోడ్లపై పోస్తున్న బొండాలు



తెనాలి నుంచి విజయవాడ వెళ్ళే రోడ్డు ప్రక్కన పోసిన ఖాళీ బొండాలు

తెనాలి పట్టణంలో ప్రతిరోజు సుమారు 10 నుంచి 12 టన్నుల ఉపయోగించిన బొండాలు వస్తున్నాయి. కానీ కంపోస్ట్ యార్డులో ప్రతిరోజు అయిదు టన్నుల బోండాలను పీచు తయారు చేసే యూనిట్ మాత్రమే ఉంది. దీని కెపాసిటీ చిన్నది కావటంతో మిగిలిన అయిదు నుంచి ఏడు టన్నుల బొండాలను కంపోస్ట్ యార్డుకు వెళ్లే రోడ్డుపై పోస్తుండేవారు. దీంతో అవి వాహనదారులకు ఇబ్బందికరంగా మారి ఎక్కువ మంది ప్రమాదాల బారిన పడుతుండటంతో కౌన్సిలర్‌లు, స్థానికులు వీటిని అక్కడి నుంచి తొలగించాలని కోరారు. దీంతో ఇటీవల మున్సిపల్ అధికారులు లారీలతో రోడ్ల వెంట ఉన్న బొండాలను బయటకు తరలించారు. అలాగే దుకాణాలలో ఉత్పత్తి అయిన బొండాలను మీరే ప్రత్యేక వాహనంలో తరలించుకోవాలని మున్సిపల్ అధికారులు వ్యాపారులకు సూచించారు. పట్టణంలో ఎక్కడ బొగండాలు ఉండటానికి వీలులేదని ఆదేశించారు. దీంతో నెల నుంచి వ్యాపారులు వాటిని శివారు ప్రాంతాలకు తరలిస్తున్నారు.

రోడ్లు, మురుగు కాల్వలు నిర్మించండి



కమిషనర్ శేషన్నకు వినతిపత్రం ఇస్తున్న పట్టణవాసులు

తెనాలిఅర్బన్: బాలాజీరావుపేటలో రోడ్లు, కాల్వలు నిర్మించాలని బాలాజీరావుపేట వాసులు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతిలు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. శాంతినగర్‌లో రక్షిత మంచినీటి పథకం పైపులైన్‌లో ఏర్పాటు చేసినప్పటికి ఇంటింటికి కనెక్షన్‌లు ఇవ్వలేదని, వాటిని ఇప్పించే విధంగా చూడాలని పలువురు కోరారు. అలాగే బీసీ కాలనీలో ఖాళీస్థలాల్లో పిచ్చిమొక్కలు పెరగడం వలన ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వాటిని తొలగించాలని, పింఛన్‌కు తనకు అర్హతు ఉందని దానిని ఇప్పించాలని మరొకరు కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మౌలానా ఆజాద్ జీవితం ప్రపంచానికి ఆదర్శం



ఆజాద్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

తెనాలి: వర్తమాన ప్రపంచ పరిణామాల నేపథ్యంలో 'భారతరత్న' మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం ప్రపంచానికి ఆదర్శమని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన అజాద్ జయంతి వేడుకలో వక్తలు అభిప్రాయపడ్డారు. ఐక్య వేదిక అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్‌కుమార్ అధ్యక్షత వహించారు. సంప్రదాయ ఇస్లామిక్ విద్యను అభ్యసించిన ఆజాద్ ఉన్నత చదువులు చదివాడనీ, పలు భాషలను, శాస్త్రాలను అధ్యయనం చేసినట్టు తెలిపారు. మౌలానా అయేందుకు కావల్సిన శిక్షణ తీసుకుని, దివ్యఖురాన్‌పై భాష్యం రాసినట్టు చెప్పారు. ఆయన ప్రారంభించిన 'ఆల్ హిలాల్' వారపత్రిక విప్లవాత్మక ధ్వనిగా నిలిచిందన్నారు. తర్వాత గాంధీజీ బాటలో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని పలుసార్లు అరెస్టయినట్టు చెప్పారు. ఉప్పుసత్యాగ్రహం, సహాయ నిరాకరణోద్యమం, క్విట్‌ఇండియా ఉద్యమాల్లో పాల్గొని పదేళ్ల జైలుశిక్ష అనుభవించినట్టు వివరించారు. స్వాతంత్ర్యం సిద్ధించాక విద్యారంగంలో అనేక సంస్కరణలను తీసుకొచ్చినట్టు చెబుతూ, అందుకే ఆయన జన్మదినమైన నవంబరు 11న జాతీయ విద్యాదినోత్సవంగా జరుపుకుంటున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు, మున్సిపల్ కౌన్సిలరు షేక్ దుబాయ్‌బాబు, సయ్యద్ గౌస్, షేక్ సాబిద్, ఎ.బాబి, కృష్ణంరాజు, వెంకట్ పాల్గొన్నారు. తొలుత మౌలానా ఆజాద్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

కుళాయి కనెక్షన్లకు నగదు వసూలు చేస్తున్నారు!

తహసీల్దార్ గోపాలకృష్ణకు కొలకలూరు వాసులు ఫిర్యాదు



పైపులైన్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలిరూరల్: ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ఆధ్వర్యంలో తెనాలి మండలం కొలకలూరులోని ఎస్సీకాలనీలో వేస్తున్న పైపులైన్ల నుండి తాగునీటి కుళాయి కనెక్షన్‌ల కోసం అక్రమంగా నగదు వసూలు చేస్తున్నారని గ్రామస్తులు సోమవారం సబ్‌కలెక్టర్ సంజనా సింహాకు ఫిర్యాదు చేశారు. కాలనీలో రెండేళ్లుగా తాగునీటి సమస్యతో బాధపడుతున్నామని, మురుగునీరు వస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ సోమవారం రాత్రి గ్రామంలోని ఎస్సీ కాలనీకి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో కలసి వెళ్లారు. పైపులైన్లను పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. ఇంటింటికిచ్చే కుళాయి కనెక్షన్‌లకు అక్రమంగా కనెక్షన్‌కు రూ. వెయ్యి చొప్పున వసూలు చేస్తున్నారని గ్రామస్తులు తహసీల్దార్‌కు వివరించారు. ఇప్పటి వరకు 300 కనెక్షన్‌లకు వసూలు చేశారని చెప్పారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పైపులైన్లలో లీకులు ఉన్నట్టు గుర్తించామని, జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కాంట్రాక్టరుతో ఉన్న ఒప్పందాలు, వివాదాల గురించి చర్యలు తీసుకుంటామన్నారు.

అనుమతి వస్తే...



తెనాలి జిల్లా వైద్యశాలలో పాడైన ఇనుప బెడ్‌లు, కుర్చీలు, ఇతర వస్తువులు శిథిలావస్థకు చేరుతున్నాయి. వీటికి వేలంపాట నిర్వహించాల్సి ఉన్నప్పటికీ అధికారులు ప్రభుత్వ అనుమతుల కోసం ఎదురుచూస్తున్నారు. వివరాలోకి వెళితే తెనాలి జిల్లా వైద్యశాలలో గతంలో ఉపయోగించిన ఇనుప మంచాలు, కుర్చీలు, ఇతర పరికరాలు పాడైపోవడంతో అధికారులు వాటిని వెనుక వైపు పడవేశారు. వాటికి వేలం పాట ద్వారా అమ్మేందుకు ఉన్నతాధికారుల అనుమతిని కోరారు. వారి నుంచి ఇప్పటి వరకు అనుమతులు రాకపోవడంతో అవి తుప్పుపట్టి పాడైపోతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వాటికి వేలంపాట నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

–తెనాలిఅర్బన్

తెనాలిలో మునిసిపల్ ఎస్ఈ పర్యటన

తెనాలిఅర్బన్: పట్టణంలో మున్సిపల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ దాసరి శ్రీనివాసరావు సోమవారం సాయంత్రం పర్యటించారు. అమృత–2 పథకంలో ప్రతిపాదనలు పంపిన పలు స్థలాలను ఆయన పరిశీలించారు. బస్టాండ్ అవుట్ గేట్ ఎదురు ఉన్న మున్సిపల్ స్థలాన్ని, రామలింగేశ్వరపేటలోని ఓపెన్ ఆడిటోయంను పరిశీలించారు. అక్కడ రిజర్వాయర్ ఏర్పాటు చేయడానికి అనువైన వసతులు ఉన్నాయా లేదా అనే దానిపై ఆరాతీశారు. అనంతరం పరిమి రోడ్డులోని దోనేపూడి వారి వీధిలో ఎస్‌టీపీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపిన స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, పలువురు డీఈలు, ఏఈలు ఉన్నారు.

సమస్యలపై అర్జీలు ఇవ్వండి

కొల్లిపర: మండల పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ, వివిధ శాఖల సమస్యలు, గ్రామ సమస్యలపై ప్రతి సోమవారం రెవెన్యూ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీలను అందజేయవచ్చని తహసీల్దారు జి.సిద్దార్థ తెలిపారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు ఉన్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భక్తులతో కిక్కిరిసిన శివాలయాలు

- విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహణ
- కార్తిక దీపారాధనలు చేసి, మొక్కులు చెల్లించుకున్న భక్తులు



శివలింగాకృతితో..



మారీసుపేట శివాలయంలో..



సంగజాగర్లమూడి సంగమేశ్వరాలయంలో...



పాత శివాలయంలో ...

తెనాలి: పవిత్ర కార్తిక మాసంలో విశేషమైన సోమవారాన్ని పురస్కరించుకుని తెనాలి పట్టణం, పరిసర గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రెండవ కార్తిక సోమవారం సందర్భంగా భక్తులు తెల్లవారుజామునే ఆలయాలకు తరలి వెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. చారిత్రక ప్రసిద్ధి చెందిన గంగానమ్మపేటలోని శ్రీపర్వత వర్ధినీసమేత శ్రీ రామేశ్వర స్వామి దేవస్థానం (పాత శివాలయం)కు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున 3 గంటల నుంచే ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావటం ఆరంభించారు. కొద్ది సేపట్లోనే క్యూలైన్లు, ఆలయ ప్రాంగణం కిక్కిరిశాయి. అలయతోట ప్రాంగణంలో మహిళలు కార్తీక దీపారాధనలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్తిక సోమవారం సందర్భంగా ఆలయ అర్చకస్వాములు శ్రీరామేశ్వరస్వామికి ఉదయం నుంచి విశేష అభిషేకాలు నిర్వహించారు. శ్రీపర్వతవర్ధినీ అమ్మవారు శ్రీరాజరాజేశ్వరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి, అమ్మవార్ల దర్శనానికి అత్యధిక సమయం పట్టినప్పటికీ భక్తులు క్యూలైన్లలో వేచి ఉండి మరీ దర్శనం చేసుకున్నారు. ఆలయ ఈవో వీవీ రమణకుమారి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మారీసుపేటలోని శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత శ్రీ చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలో ఉదయం నుండి భక్తుల రద్దీ నెలకొంది. పరిసర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో కార్తీక దీపారాధనలు చేశారు. రామలింగేశ్వరపేటలోని శ్రీదుర్గా పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో కార్తిక సోమవారం పూజలు విశేషంగా జరిగాయి. తెల్లవారుజాము నుండే ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తిక దీపారాధనలు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సుల్తానాబాద్ లోని శివాలయంలో కార్తిక మాసం రెండవ సోమవారం స్వామివారికి విశేష అభిషేకాలు జరిపారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపారాధనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పినపాడులో పురాతనమైన శ్రీగంగాభ్రమరాంబా సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానంలో రెండవ కార్తిక సోమవారం పూజలు ఎంతో వైభవంగా జరిగాయి. ఎంతో విశిష్టతతో బ్రహ్మసూత్రం కలిగి ఉన్న శివలింగానికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. భక్తులు ఉదయాన్నే ఆలయానికి వచ్చి దీపారాధనలు చేశారు. శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామిని దర్శించుకున్నారు. తెనాలి రూరల్ మండలం సంగంజాగర్లమూడి గ్రామంలోని శ్రీ బాలత్రిపుర సుందరీ సమేత శ్రీ సంగమేశ్వర స్వామి ఆలయంలో కార్తికమాస విశేష పూజలు వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి విశేష రుద్రాభిషేకాలు నిర్వహించారు. ప్రజలు పెద్దసంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్తిక దీపారాధనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మాణిక్యారావు సిద్దార్థ వెంకట మార్కండేయ రావు, కార్య నిర్వహణాధికారి వి. పద్మ, ఆలయ అర్చకులు పర్యవేక్షించారు. నందివెలుగు గ్రామంలో ఎంతో పురాతన ప్రసిద్ధి చెందిన శ్రీఅగస్త్యేశ్వర స్వామి దేవాలయంలో రెండవ కార్తిక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

శివలింగ ఆకృతిలో లక్ష వత్తుల దీపారాధన

పవిత్ర కార్తీకమాసం రెండో సోమవారం పురస్కరించుకుని బాలాజీరావుపేటలోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో శివలింగ ఆకృతిలో లక్ష వత్తుల దినోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త జాజుల వెంకటేశ్వరరావు, ఆలయ పూజారి బాబీ,జగదీష్ పర్యవేక్షించారు.

ఘనంగా అన్నాభిషేకం



కొల్లిపర: మండల కేంద్రమైన కొల్లిపర గ్రామంలో శ్రీగంగా పార్వతి సమేత శ్రీముక్తేశ్వర స్వామి వారి దేవస్థానంలో కార్తీక మహోత్సవంలో భాగంగా రెండువ సోమవారం సందర్భంగా భక్తుల సమక్షంలో ఆలయ పండితులు వేద మంత్రాలతో స్వామి వారికి అన్నాభిషేకం నిర్వహించినట్లు ఆలయ అర్చకుడు కొల్లిపర పిచ్చయ్య శర్మ తెలిపారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు ఆలయ కమిటి సభ్యులు అందించారు.